క్లుప్తంగా

భక్తులకు ఆర్థిక సహాయం



భక్తులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని లక్కవరం నుంచి షిర్డీ యాత్రకు వెళుతున్న 40 మంది భక్తులకు సొసైటీ చైర్మన్ దల్లి నాగేశ్వరరావు రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేశారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మ గురునాధం, ఇర్ల విజయ్ పాల్గొన్నారు.

పారిజాతగిరిలో విశేష పూజలు



శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: శ్రీరామ నవమి సందర్భంగా గోకుల తిరుమల పారిజాతగిరి ఆలయంలో బుధవారం శ్రీవేంకటేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ మొదలుకుని ఆరాధన, బాలభోగ నివేదన, తీర్థ ప్రసాదగోష్టి తదితర పూజలు నిర్వహించారు. కాగా భక్తురాలు బలుసు పూర్ణిమ తన మొదటి నెల జీతం రూ. 60,116 స్వామి వారి నిత్యాన్నదానానికి విరాళంగా అందజేసినట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. భక్తులకు కంది బాలకృష్ణారెడ్డి, సీతా హాస్పటల్ సీతామహాలక్ష్మి పానకం, వడపప్పు, కట్టుపొంగలి ప్రసాదాన్ని అందజేశారు.

మద్ది క్షేత్రంలో రామయ్య కల్యాణం



మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో రామయ్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చక బృందం

జంగారెడ్డిగూడెం రూరల్: శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకుని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో ఆలయ అర్చకులు, వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ బుధవారం సీతారాముల కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో రామయ్య కల్యాణాన్ని వీక్షించి తరించారు. పాలకోడేరు గ్రామానికి చెందిన కునాధరాజు అర్జునరాజు, పార్వతి దంపతులు నిత్యాన్నధాన పథకానికి రూ.లక్ష విరళం అందజేసినట్లు ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా



సీతంపేటలో రాజీనామా చేసిన వలంటీర్లు

కొయ్యలగూడెం: సీతంపేట సచివాలయ పరిధిలో విధులు నిర్వహిస్తున్న వలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. ఇప్పటికే కొంతమంది రాజీనామా చేయగా మిగిలిన వలంటీర్లు రాజీనామాలు చేయడంతో సచివాలయం పరిధిలో మొత్తం వలంటీర్లు రాజీనామా చేసినట్లయింది. ప్రతిపక్షాలు ఇప్పటివరకు తమపై తప్పుడు ఆరోపణలు చేసి.. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్నాయని తమపై ప్రేమ కురిపిస్తుండడం వారిలోని అవకాశవాదాన్ని తెలియజేస్తుందని వలంటీర్లు దుయ్యబట్టారు.

ఘనంగా నవమి వేడుకలు



శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న సీతారాముల కల్యాణం

జంగారెడ్డిగూడెం: పట్టణంలో శ్రీరామనవమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. బుట్టాయగూడెం రోడ్‌లో కొలువైన శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో ఆకుల కొండలరావు కార్యక్రమాలను పర్యవేక్షించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పేరంపేట రోడ్‌లో ఉన్న పెద్ద రామాలయం, చిన్న రామాలయాల వద్ద నిర్వహించిన నవమి వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, బత్తిన చిన్న దంపతులు పాల్గొని పూజలు చేశారు. స్థానిక జేపీ సెంటర్‌లో జేసీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ముస్లింలు పాల్గొని హిందువులకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. భక్తులకు పానకం, పులిహోర, వడపప్పు ప్రసాదాన్ని అందించారు. జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ అధ్యక్షుడు షేక్ ముస్తఫా, షేక్ యాకూబ్, సాహెన్షా, జేసీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం

చింతలపూడి: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా మండలంలో సీతారాముల కల్యాణాన్ని బుధవారం అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి రామాలయాల వద్ద భక్తులు కిటకిటలాడారు. రామనామ జపంతో రామాలయాలు మార్మోగాయి. భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో భద్రాచలంలో కల్యాణం నిర్వహించే సమయానికే సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. మండలంలోని రాఘవాపురం, యర్రంపల్లి, ప్రగడవరం, సీతానగరం, రేచర్ల గ్రామాల్లో, పట్టణంలోని వెలమపేట, ఫైర్‌స్టేషన్ సెంటర్, పాత బస్టాండ్, మెరకవీధి, ఆలపాటి కాంప్లెక్స్ ఆలయాల వద్ద సీతారాముల కల్యాణాన్ని జరిపించి భక్తులకు పానకాలు పోశారు.

యర్రగుంటపల్లిలో...

చిన్న భద్రాద్రిగా పిలవబడుతున్న యర్రగుంటపల్లి గ్రామంలోని రాముడి గట్టుపై వేంచేసి ఉన్న సీతారాములకు అంగరంగ వైభవంగా కల్యాణం జరిపించారు. భక్తుల జంటలు పీటలపై కూర్చొని స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. సీతారాముల విగ్రహ మూర్తులను గ్రామం నుంచి ఊరేగింపుగా రాముడి గట్టు వద్దకు తీసుకువచ్చారు. గారపాటి తపనా చౌదరి దంపతులు స్వామివారి కల్యాణానికి ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. అనంతరం సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్‌తో కలిసి కల్యాణంలో పాల్గొన్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాక జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు రామయ్య కల్యాణాన్ని తిలకించడానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా 10 వేలమంది భక్తులకు అన్న సమారాధన చేశారు.

రమణీయం.. సీతారాముల కల్యాణం

లింగపాలెం: మండలంలో బుధవారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లోని రామాలయాల వద్ద భద్రాచలంలో కల్యాణం నిర్వహించే సమయానికే స్వామివారి కల్యాణం జరిపించారు. లింగపాలెంలోని పడమట రామాలయంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేత భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి (బీవీఎస్ రెడ్డి) ప్రసన్న కుమారి దంపతులు సీతారాముల కల్యాణం జరిపించారు. బీవీఎస్ రెడ్డి నాలుగు పంచలోహ విగ్రహాలను ఆలయానికి అందజేశారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నసమారాధన చేశారు. లింగపాలెం, ధర్మాజీగూడెం గ్రామాల్లో జరిగిన రామయ్య కల్యాణ వేడుకలను వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, పార్టీ నాయకులు తిలకించారు. రంగాపురంలో సీతారామచంద్ర స్వామి ఆలయంలో నిర్వహించిన రామయ్య కల్యాణ వేడుకకు పెద్ద ఎత్తున భక్తులు, మహిళలు తరలివచ్చారు.



చింతలపూడి: రాముడి గట్టుపై సీతారాముల కల్యాణం



బుట్టాయగూడెం: దుద్దుకూరులో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి

వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు

ద్వారకాతిరుమల: మండలంలో వాడవాడలా శ్రీరామనవమి వేడుకలను అట్టహాసంగా జరుపుకున్నారు. స్థానిక చెరువు వీధిలోని రాణీచిన్నయమ్మారావు సదనం వద్ద కొత్త శ్రీనివాస్, అన్నపూర్ణ దంపతులు ఈ వేడుకను వైభవంగా జరిపించారు. అలాగే గుడిసెంటర్‌లో, మావులేటి సోమరాజు సదనం వద్ద సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. గుడి సెంటర్‌లో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

శ్రీవారి క్షేత్రంలో...

శ్రీరామ నవమిని పురస్కరించుకుని శ్రీవారి క్షేత్రంలోని నిత్యకల్యాణ మండపంలో చినవెంకన్న, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లతో పాటు, మరో రజిత సింహాసనంపై సీతారాములను వేంచేపు చేసి, అర్చకులు కల్యాణ తంతును ప్రారంభించారు. సుముహూర్త సమయంలో నూతన వధువరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపజేశారు. ఆ తరువాత మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకలను వైభవోపేతంగా నిర్వహించారు. రాత్రి తొళక్క వాహనంపై సీతారాముల గ్రామోత్సవం అట్టహాసంగా జరిగింది.



ద్వారకాతిరుమల: రాణీచిన్నయమ్మారావు సదనం వద్ద రాములోరి కల్యాణం

టి.నరసాపురం: శ్రీరామనవమి వేడుకలు మండలంలో వాడవాడలా ఘనంగా నిర్వహించారు. బుధవారం రామాలయాల్లో సీతారాముల కల్యాణం ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ ఆలయాల వద్ద బెల్లం పానకాలను భక్తులకు పంపిణీ చేశారు. టి.నరసాపురం శివాలయం వీధిలో ఉన్న రామాలయం వద్ద గ్రంధాలయ సంస్థ చైర్మన్ నల్లూరి శ్రీనివాస దంపతులు, ఎర్రకాలువ బంద్రేవు వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద కొనకల మోహన్ కుమార్ దంపతులు కల్యాణోత్సవాలను నిర్వహించారు.

గిరిజన పల్లెల్లో...

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో శ్రీరామనవమి వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గిరిజన పల్లెల్లో సీతారాముల కల్యాణాన్ని పలు దేవాలయాల్లో అత్యంత వైభవంగా నిర్వహించారు. దుద్దుకూరులో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు సీతారాముల కల్యాణం జరిపించారు. ఈ వేడుకల్లో గ్రామస్తులు పాల్గొని తరించారు. కృష్ణాపురం, స్థానిక ఎంపీపీ మెయిన్ స్కూల్ వద్ద రామాలయాల్లో, అభయాంజనేయస్వామి వారి గుడి వద్ద, దొరమామిడి, రెడ్డిగణపవరం, ముప్పినవారిగూడెం, తెల్లంవారిగూడెంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మారుమూల గ్రామమైన లక్ష్మీపురంలో నాయక్‌పోడు గిరిజనులు తరతరాలుగా వస్తున్న ఆచారాన్ని కొనసాగించారు. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా అడవి నుంచి సేకరించిన చెట్ల మానులను సీతారామ లక్ష్మణులుగా తయారు చేసి ఘనంగా పూజలు చేశారు.

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలోని నాలుగు ప్రధాన రామాలయాలతో పాటు అన్ని హిందూ దేవాలయాలలో బుధవారం శ్రీరామనవమి వేడుకలు నిర్వహించి పానకం పంపిణీ చేశారు. ఎనిమిదవ వార్డు రామాలయం వద్ద తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాతలు బెల్లం దిమ్మలు పంచిపెట్టారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం సీతారామ లక్ష్మణ సమేత హనుమద్ ఉత్సవ విగ్రహాలను పలు గ్రామాల్లో పల్లకీలో కూర్చుండబెట్టి గ్రామోత్సవం నిర్వహించారు.

చిన భద్రాద్రిలో...



కామవరపుకోట: ఈస్ట్ యడవల్లిలో రామయ్య కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

కామవరపుకోట: చిన్న భద్రాదిగా పిలవబడే ఈస్ట్ యడవల్లిలోని కోదండరామ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. రాములోరి కల్యాణం కనుల పండుగగా జరిగింది. దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఈ వేడుకలను తిలకించారు. అర్చకులు శేషాచార్యులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. కామవరపుకోటలో వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో, కొత్తూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీరామనవమి వేడుకలు జరిపారు.

కుక్కునూరు: శ్రీరామనవమి వేడుకలు బుధవారం మండలంలోని రామాలయాలలో ఘనంగా నిర్వహించారు. కుక్కునూరులో రామాలయం వద్ద అర్చకులు నవీన్ శర్మ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని జరిపారు. అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను ఊరేరగించారు.

పోలవరం రూరల్: మండలంలోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలు, వైష్ణవాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. పోలవరం పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఎస్సై వెంకట పవన్‌కుమార్ దంపతులు ఉభయదారులుగా వ్యవహరించి కల్యాణం జరిపించారు.



టి.నరసాపురం: శివాలయం వీధిలో సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం



చింతలపూడి: ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



కొయ్యలగూడెం: కన్నాపురం రామాలయం వద్ద స్వామివారి కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు



పోలవరం రూరల్: ఆంజనేయస్వామి ఆలయంలో సీతారామ కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



లింగపాలెం: పడమటి రామాలయం వద్ద కల్యాణం నిర్వహిస్తున్న బీవీఎస్ రెడ్డి, ప్రసన్నకుమారి దంపతులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టి.నరసాపురం: రాజుపోతేపల్లి 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని కొత్తగూడెం ఫీడర్‌కు గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనులు జరుగుతున్న దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు బహిరంగ వేలం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రతి శుక్రవారం నిర్వహించే పశువుల సంత అనంతరం మరుసటి రోజు యార్డును శుభ్రం చేయడం, పశువుల పేడ ప్రోగు చేసుకుని తీసు వెళ్లడానికి గాను ఏడాది కాలానికి బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు యార్డు కార్యదర్శి ఎస్కే మహరాజ్‌పాషా (భాష) బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ యార్డులో శుక్రవారం ఉదయం 10 గంటలకు రీ ఓపెన్ ఆక్షన్ నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్న వారు ఒక గంట ముందు రూ.2,500 ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన నేతలు







ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఏఎంసీ చైర్‌పర్సన్ జె జానకిరెడ్డి, దయాల నవీన్‌బాబు, కందుల దినేష్‌రెడ్డి

చింతలపూడి: పశ్చిమగోదావరి జిల్లా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చింతలపూడి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే ఎన్నికల్లో 175 నియోజకవర్గాల్లో విజయం సాధించాలని కోరుతూ శుభాకాంక్షలు చెప్పినట్లు ఆమె తెలిపారు. అదే విధంగా ఇటీవల సీఎంపై దాడి జరిగిన నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని సూచించినట్లు చెప్పారు. చింతలపూడి నియోజకవర్గంలో గతంలో కంటే మెజార్టీ తీసుకురావాలని సీఎం వైఎస్ జగన్ సూచించినట్లు జానకిరెడ్డి చెప్పారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

లింగపాలెం: సిద్ధం బస్సుయాత్రలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాలో పర్యటిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం లింగపాలెం మండలానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత, రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు కలిశారు. పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేయాలని, చింతలపూడి అభ్యర్థి కంభం విజయరాజు గెలుపునకు కృషి చేయాలని సీఎం సూచించినట్లు నవీన్‌బాబు తెలిపారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

చింతలపూడి: మేమంతా సిద్ధం బస్సు యాత్రంలో భాగంగా ఈతకోటలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని బుధవారం వైఎస్సార్ సీపీ యూత్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుల దినేష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. చింతలపూడి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని సీఎం వైఎస్ జగన్ సూచించినట్లు దినేష్‌రెడ్డి చెప్పారు.


ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



డీఎస్పీ రవిచంద్ర

జంగారెడ్డిగూడెం: ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించుకునేలా ఆయా పార్టీల అభ్యర్థులు సహకరించాలని జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర అన్నారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతలపూడి నియోజకవర్గానికి సంబంధించి చింతలపూడి ఆర్‌వో కార్యాలయంలో ఈ నెల 18 నుంచి 25 వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. నామినేషన్లు వేసే అభ్యర్థులు ఎన్నికల నియమావళిని అనుసరించాలన్నారు. అభ్యర్థి నామినేషన్ వేసేందుకు వచ్చే సమయంలో ర్యాలీగా గాని, ప్రచారం చేసుకుంటూ గాని రావాలనుకుంటే ముందుగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి వద్ద అనుమతులు తీసుకోవాలన్నారు. అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇక ర్యాలీగా వచ్చే సమయంలో ఎటువంటి బాణసంచాకు అనుమతులు లేవన్నారు. అభ్యర్థులు నామినేషన్‌కు వచ్చే సమయంలో గాని, ప్రచారాలు చేసుకునే సమయంలోగాని ఇతర పార్టీల మీద, అభ్యర్థుల మీద, వ్యక్తుల మీద విషపూరిత ప్రచారాలు, వ్యక్తిగత దూషణలు లేకుండా చూసుకోవాలన్నారు. సదరు పార్టీల అభ్యర్థులు వారి పార్టీ గురించి, వారి గురించి మాత్రమే ప్రచారం చేసుకోవాలన్నారు. జంగారెడ్డిగూడెం సర్కిల్ పరిధిలో అలజడులు, అశాంతి వాతావరణం లేకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు, ప్రజలు సహకరించాలని కోరారు.

అతివల ఆర్థికాభివృద్ధికి ఆసరా



బుట్టాయగూడెంలో నాలుగో విడత ఆసరా చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు (ఫైల్)

- ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాల మాఫీ
- నాలుగు విడతల్లో సొమ్ములు చెల్లించిన సీఎం జగనన్న
- ఆనందంలో డ్వాక్రా సంఘాల మహిళలు

నియోజకవర్గంలో మండలాలు – 7
మొత్తం గ్రామ సంఘాలు – 6,200
ఆసరా లబ్ధి పొందిన సభ్యులు – 59,170
జమ అయిన మొత్తం సొమ్ము – రూ.176.76 కోట్లు

బుట్టాయగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాల్లో ఒకటైన వైఎస్సార్ ఆసరా పథకం మహిళలకు ఎంతో అండగా నిలుస్తోంది. మహిళలే మహారాణులనే నానుడిని నిజం చేస్తూ మహిళల కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆసరా పథకాన్ని ప్రవేశపెట్టింది. డ్వాక్రా సంఘాల్లోని మహిళలు ఆర్థికంగా సొంత కాళ్లపై నిలబడాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుంది. నాడు పాదయాత్రలో, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ఆసరా పథకం కింద 2019 ఏప్రిల్ వరకూ బ్యాంక్‌ల వద్ద పెండింగ్‌లో ఉన్న బకాయిలను ప్రభుత్వం దశలవారీగా మాఫీ చేస్తుంది. ఇప్పటివరకూ నాలుగు దశల్లో డ్వాక్రా సంఘాలు తీసుకున్న రుణాన్ని రాష్ట్ర ప్రభుత్వం మాఫీ చేయడం జరిగింది. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణాలను మాఫీ చేయడం పట్ల మహిళా సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. మళ్లీ ముఖ్యమంత్రిగా సీఎం జగనన్నే రావాలని కోరుకుంటున్నారు.

మహిళలను మోసం చేసిన టీడీపీ

టీడీపీ ప్రభుత్వం హయాంలో మహిళా సంఘాలకు తీరని అన్యాయం జరిగింది. 2014 ఎన్నికల సమయంలో డ్వాక్రా సంఘాల్లోని రుణాలన్నీ మాఫీ చేస్తామని, ఎవరూ ఆ రుణాలను చెల్లించవద్దంటూ నాడు చంద్రబాబు హామీ ఇచ్చి మోసం చేయడంతో అక్కచెల్లెమ్మలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం జరగబోయే ఎన్నికల్లో మహిళలను మరోసారి మోసం చేసేందుకు కూటమి పేరుతో చంద్రబాబు అమలుకు సాధ్యం కాని హామీలను ఇస్తున్నారని, వాటిని నమ్మి మళ్లీ మోసపోవద్దని వైఎస్సార్‌సీపీ శ్రేణులు హెచ్చరిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాఫీ

డ్వాక్రా సంఘాల రుణాలను దశల వారీగా మాఫీ చేస్తామని జగన్‌మోహన్‌రెడ్డి నాడు పాదయాత్రలో హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్ సారథ్యంలో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మహిళలకు రుణాలను మాఫీ చేస్తూ రావడం జరిగింది. అలాగే ఇప్పటి వరకూ నాలుగు దశల్లో రుణాలను ప్రభుత్వం చెల్లించడంతో మహిళా సంఘాల కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు విడతల్లో రూ.176.76 కోట్ల మాఫీ

పోలవరం నియోజకవర్గంలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, కొయ్యలగూడెం, టి.నర్సాపురం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల పరిధిలో సుమారు 6200 డ్వాక్రా సంఘాల్లోని 59,170 మంది సభ్యులకు సుమారు రూ.176.76 కోట్ల వరకూ నాలుగు విడతల్లో వైఎస్సార్ ఆసరా పథకంలో సొమ్ములు చెల్లించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. నాలుగు విడతలుగా మహిళా సంఘాల ఖాతాల్లో మాఫీ సొమ్ములు జమ కావడంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేస్తూ మహిళలు ఆసరా సంబరాలను ఘనంగా జరుపుకుంటున్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



డ్వాక్రా సంఘాల అప్పులను దశలవారీగా మాఫీ చేస్తామని ఇచ్చిన హామీని సీఎం జగనన్న నెరవేర్చారు. మా గ్రూప్ సభ్యులకు సుమారు రూ.2 లక్షల వరకూ ఆసరా పథకంలో డబ్బులు వచ్చాయి. ఆ డబ్బులను సక్రమంగా వినియోగించుకుంటున్నాం. జగనన్నకు రుణపడి ఉంటాం.

– కణితి చంద్రకళ, ఝాన్సీ రాణి గ్రూప్, సీతప్పగూడెం

హామీలను నెరవేర్చారు



2019 ఎన్నికల్లో జగనన్న ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేస్తూ నిరూపిస్తున్నారు. ఇప్పటివరకూ నాలుగు విడతలుగా మా గ్రూప్ సభ్యులకు రూ.లక్ష వరకూ సొమ్ములు వచ్చాయి. జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాను.

– తాతి ఉమామహేశ్వరి, దీవెన గ్రూప్, సీతప్పగూడెం